
- పులివెందులలో రూ.2కోట్లతో విద్యుత్ టవర్ల ఏర్పాటుకు టెండర్
- ఇప్పటికే పాడా నిధులతో పలు అభివృద్ధి పనులు
- ఇందులో విద్యుత్ టవర్ల ఏర్పాటు కూడా
- వైసీపీ విధేయుడిగా ముద్రపడిన ఆ సారు..
- కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతున్న వైనం
- పులివెందుల నుంచి తిరుపతికి డైరెక్ట్ కాంటాక్ట్

ప్రభుత్వం మారినా..
ఆ సార్‌దే హవా..!




(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఏర్పాటైన పులివెందుల ఏరియా డెవలప్‌మెంటు ఏజెన్సీ (పాడా) పై ఎన్నో అభియోగాలున్నాయి. అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయల పాడా నిధులు నీళ్లలా ఖర్చు చేశారు. దేనికి ఖర్చు పెట్టారో లెక్కపక్కా లేదు. ఏ నిధులు ఎంత వచ్చాయని చెప్పే నాథుడు లేడు. అంతలా ఖర్చు పెట్టేశారు. పనులు చేయకున్నా చేసినట్లు, చేసిన పనులకే మళ్లీ మళ్లీ బిల్లులు చేశారనే ఆరోపణలున్నాయి. పాడా నిధుల వినియోగమంతా చాలా గోప్యంగా జరిగిందంటారు. కొందరు అధికారులు వైసీపీ నేతలతో కలిసి నిధులను ఫలహారంగా భుజించారనే ఆరోపణలున్నాయి. ఇక వైసీపీ హయాంలో చేసిన భూకబ్జాలు, పులివెందుల హౌసింగ్‌లో గోల్‌మాల్, పాడా నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పలు ఆరోపణలు చేస్తూ వచ్చారు. నిధుల దుర్వినియోగంపై, అక్రమాలపై ఫిర్యాదు చేస్తూ వచ్చారు.

ఈ నేపథ్యంలో ఇప్పుడు పులివెందులలో విద్యుత్‌టవర్ల కోసం రూ.2కోట్లతో టెండర్లు నిర్వహించడం విద్యుత్‌శాఖలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వంలో చేసిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే విద్యుత్‌శాఖలో వైసీపీ హయాంలో చక్రం తిప్పిన ఓ అధికారి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పుతూ తనదైన స్టైల్‌లో టవర్ల పేరిట టెండర్లు నిర్వహించడం గమనార్హం. జిల్లా ఎస్పీడీసీఎల్‌కు ఎస్ఈ బాస్. అయితే ఈ సారు మాత్రం కడపతో సంబంధం లేకుండా నేరుగా తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ అధికారులతో కాంటాక్ట్ పెట్టుకుని వారితోనే వ్యవహారాలన్నీ నడుపుతారని అంటున్నారు. టీడీపీ హయాంలో కూడా ఈయన హవా చూసి విద్యుత్ అధికారులు ఔరా అంటూ ఆశ్చర్యపోతున్నారు.

ఆ సారు కథే వేరబ్బా

జగన్ పాలనలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కోసం పాడాను ఏర్పాటుచేశారు. దీని ద్వారా నియోజకవర్గంలో రహదారులు, పాఠశాలలు, విద్యుత్ ఇలా అన్ని రకాల పనులు చేపట్టారు. ఇందుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. ఇక పులివెందుల సుందరీకరణకు అయితే కోట్లు కుమ్మరించారు. పులివెందులకు పెట్టిన నిధుల్లో కనీసం పావలా వంతు కూడా కడపకు కేటాయించలేదు. పులివెందులను అందంగా తయారు చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పలు విద్యుత్ పనులు చేపట్టారు. 33 కేవీ విద్యుత్ లైనును స్తంభాలపై కాకుండా టవర్ల మీద వెళ్లేందుకు గాను పెద్దఎత్తున టవర్లు ఏర్పాటు చేశారు. వీటిల్లో చాలా మటుకు అన్నీ పాడా నిధులతోనే చేశారు. జగన్ ప్రభుత్వం జూన్ 4తో సమాప్తం అయింది. ఆ నెల 12 నుంచి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. పరిపాలన సౌలభ్యంలో భాగంగా అధికారులను మారుస్తున్నారు. ముఖ్యంగా వైసీపీ నేతలతో అంటకాగి అవినీతికి పాల్పడిన అధికారులను బదిలీ చేస్తున్నారు. అయితే ఈ సార్ జోలికి మాత్రం పోలేదు. ఈ సారు పులివెందుల ప్రాంతంలో ట్రాన్స్‌కోలో పనిచేస్తున్నారు. దాదాపు 15 సంవత్సరాలుగా పులివెందుల నియోజకవర్గంలోనే రింగ రింగా అంటూ తిరుగుతున్నారు. 2014-19 టీడీపీ హయాంలో అప్పట్లో తెలుగుదేశంలో ఉన్న వేంపల్లెకు చెందిన నేతకు సన్నిహితంగా మెలిగారంటారు. ఇక వైసీపీ పాలన వచ్చిన తరువాత పులివెందులకు చెందిన ముఖ్యనేతకు అత్యంత సన్నిహితుడుగా మారాడంటారు. అప్పట్లో తిరుపతిలోని ట్రాన్స్‌కోలో కీలక అధికారులతో ఈ సారు నేరుగా సంబంధాలు పెట్టుకున్నారంటారు. అది ఇప్పటికీ కొనసాగుతోందని అంటున్నారు.

పులివెందుల పట్టణ వ్యూ



కూటమి ప్రభుత్వంలో

కూటమి ప్రభుత్వంలో కూడా ఈ సారు చక్రం తిప్పడం గమనార్హం. పులివెందుల రింగు రోడ్డులో 32 చోట్ల 32 ఎంప్లేస్‌మెంట్ జీఐ టవర్స్ ఏర్పాటు చేయాలని వైసీపీ హయాంలో నిర్ణయించారు. ఈ మేరకు ఈ ఏడాది జనవరి 27న ఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ద్వారా అనుమతులు తీసుకుని పులివెందుల నేత సిఫారసుతో మంజూరు చేయించుకున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు మళ్లీ టవర్స్ ఏర్పాటుకు గత నెల 22న అనుమతి తీసుకుని రూ.2కోట్లకు ఎస్టిమేట్ వేసి టెండర్లు పిలిపించారు. వైసీపీ హయాంలో ఎస్టీమేట్‌లకు ఇప్పుడు అనుమతులు రావడం చర్చనీయాంశంగా మారింది. గత నెల 27న టెండరుకు అనుమతి ఇచ్చారు. టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఈ వ్యవహారంలో అప్పుడు.. ఇప్పుడు ఆ సారు చక్రం తిప్పడం గమనార్హం. పాడా నిధుల వినియోగంలో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలున్నాయి. చేసిన పనులకే మళ్లి చేసినట్లు చెబుతారు. విద్యుత్ పనుల్లో కూడా వేసిన లైన్లు వేసినట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించినట్లు రకరకాలుగా గోల్‌మాల్ జరగాయనే ఆరోపణలున్నాయి.



రింగు రోడ్డులో ఏర్పాటు చేసిన విద్యుత్ టవర్

అయితే వాటిపై విచారణ జరగకముందే మళ్లీ ఇప్పుడు టవర్ పనులకు అనుమతులు రావడం గమనార్హం.

పులివెందుల మెడికల్ కళాశాలలో 50 సీట్ల భర్తీకి అనుమతులు

పులివెందుల రూరల్, ఆగస్టు 6: పులివెందుల మెడికల్ కళాశాలకు ఎట్టకేలకు అనుమతులు మంజూరయ్యాయి. 50 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి ఎన్ఎంసీ అనుమతిచ్చింది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యి ఇక్కడ రోగులకు సేవలు అందిస్తున్నారు. అయితే మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో కళాశాలకు అనుమతులు వస్తాయా రావా అనే సందిగ్ధం నెలకొని ఉండేది. ఎన్ఎంసీ బృందం వచ్చే సమయానికి ఆ ఆవరణలో ఉన్న మరో పూర్తయిన భవనాన్ని అధికారులు చూపించారు. ఎన్ఎంసీ బృందం ఎంబీబీఎస్‌కు అవసరమైన గదులు, వసతులు, ల్యాబ్ తదితర సౌకర్యాలను తనిఖీ చేశారు. ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది ఎంతమంది ఉన్నారు అనే వాటిపై ఆరాతీశారు. అనంతరం 100 సీట్లను భర్తీ చేసేందుకు ఇక్కడి అధికారులు నివేదికలు పంపగా ఆ భవనానికి వంద సీట్లు అనుమతులు ఇవ్వలేమని ఎన్ఎంసీ బృందం చెప్పినట్లు తెలిసింది. దీనితో మళ్లీ అనుమతులకు నివేదికలు పంపగా ఉన్న సౌకర్యాలకు అనుగుణంగా 50 సీట్లు మాత్రమే భర్తీచేసేందుకు అనుమతులు ఇచ్చింది. ఈ విషయంపై మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ 50సీట్ల భర్తీకి అనుమతులు వచ్చాయన్నారు. మరో మూడు రోజుల్లో లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్ఓపీ) వస్తుందని, అనంతరం వెబ్‌సైట్‌లో మెడికల్ కళాశాల పేరు నమోదవుతుందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి వెబ్‌కౌన్సెలింగ్ మొదలవుతుందన్నారు. 50 సీట్లు భర్తీ అయితే అందుకు తగ్గ స్టాఫ్, సౌకర్యాలు ఉన్నాయన్నారు.

కలెక్టర్, ఎస్పీలతో సమీక్షించిన సీఎం



కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో మాట్లాడుతున్న సీఎం

కడప(కలెక్టరేట్), ఆగస్టు 6: రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండవ రోజు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులు వేర్వేరుగా జిల్లాలోని పలు అంశాలపై వారితో సమీక్షించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. జిల్లాలో కొప్పర్తి పారిశ్రామిక వాడను అభివృద్ధి చేయాలని, ఉక్కు ఫ్యాక్టరీ, జాతీయ రహదారుల విస్తరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అలాగే ఎస్పీతో మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. గంజాయి, ఎర్రచందనం అక్రమ రవాణా పూర్తిగా నిర్మూలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వారితో పాటు ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

కడప(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: విజయవాడ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 11 వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజరు మోహన్‌దాస్ తెలిపారు. విశాఖ-కడప మధ్య నడిచే రైలు (17488) ఈ నెల 5 నుంచి 10 తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కడప నుంచి విశాఖ రైలు (17487) ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

ఎండా.. వాన



ఆర్టీసీ బస్టాండులో నిలిచిన వర్షపు నీరు





నగరంలో వర్షపు నీటిలో వెళ్తున్న వాహనదారులు

- రోజుకో రకంగా వాతావరణం

వాతావరణం దోబూచులాడుతోంది. ఒక రోజు వర్షం, మరో రోజు ఎండతో ప్రజలను అల్లాడిస్తోంది. మంగళవారం పగలు ఎండ వేడి, ఉక్కబోతతో భగభగలాడింది. సాయంత్రం అయ్యేసరికి కుండపోత వర్షంతో కడప నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండంతా నీళ్లు నిలిచిపోయాయి. ప్రజలు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

- కడప (ఎర్రముక్కపల్లె)

వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

- పెండింగు బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప(ఎడ్యుకేషన్), ఆగస్టు 6: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శివశంకర్ గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కోటిరెడ్డిసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరు కార్యాలయం ఎదుట చేతుల్లో అన్నంగిన్నెలు పట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతిగృహాలు సమస్యల వలయంలో ఉన్నాయని, ఇంకా అద్దెభవనాల్లో నడుస్తున్నాయని అన్నారు. కొన్ని భవనాలు వర్షానికి కూలిపోయేలా ఉన్నాయన్నారు. అలాంటి వసతిగృహాల్లోనే విద్యార్థులను ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే వార్డెన్ రెండు మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జిలుగా ఉండడం వల్ల పూర్తిస్థాయిలో వారు బాధ్యతలు నిర్వహించలేకపోతున్నారని తెలిపారు. మెస్‌చార్జిలు సకాలంలో అందకపోడంతో వార్డెన్లు విద్యార్థులకు సరైన మెనూ అమలు చేయలేక వత్తిడికి గురవుతున్నారన్నారు. ఏడేళ్లుగా వార్డెన్ పోస్టులు భర్తీకాలేదన్నారు. అలాగే వంట మనిషి, కమాటి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ కావాలసిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులకు అందించే ట్రంకుపెట్టె, ప్లేటు, గ్లాసులు, దుప్పట్లు, కాస్మెటిక్ చార్జీలు ఇంకా అందలేదని అన్నారు. నెలకు ఒకసారి హాస్టళ్లలో మెడికల్ క్యాంపు నిర్వహించి విద్యార్థులను సీజనల్‌వ్యాధుల నుంచి రక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, చంద్ర, అభిరానంద్, సోనీ, అఖిల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీగా వస్తున్న విద్యార్థులు



కలెక్టరేట్ ఎదుట అన్నం ప్లేట్లతో నిరసన తెలుపుతున్న హాస్టలు విద్యార్థులు

జగన్‌రెడ్డికి 59 మంది గన్‌మేన్లు చాలరా ?

- తులసిరెడ్డి ఎద్దేవా

వేంపల్లె, ఆగస్టు 6: ప్రస్తుతం తనకు 59 మంది గన్‌మేన్లను ప్రభుత్వం ఇచ్చింది, వారు చాలరు, 139మంది గన్‌మేన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించండి అని జగన్ హైకోర్టులో పిటీషన్ వేయడం హాస్యాస్పదమని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జగన్ పిరికితనానికి ఇది దర్పణమన్నారు. అయినా 59మందిని ఇవ్వడమే తప్పు అన్నారు. అందరు ఎమ్మెల్యేల లాగా జగన్ కూడా ఒక ఎమ్మెల్యే మాత్రమే అన్నారు. ఎమ్మెల్యేలకు 1+1 గాని, 2+2గానీ గన్‌మేన్లను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. అలాగే జగన్‌కు కూడా కల్పించాలన్నారు. జగన్ 139 మంది కావాలని అడుగుతున్నది భద్రత కోసం కాదు, స్టేటస్, హంగు, ఆర్భాటం కోసమన్నారు. స్టేటస్ కోసం గన్‌మేన్లను ఇవ్వడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకుని హోదా కోసం జగన్ హైకోర్టులో పిటీషన్ వేయడం విడ్డూరమన్నారు. ప్రతిపక్షనాయకుని హోదా ఇవ్వాలంటే అసెంబ్లీలో ఎమ్మెల్యేల మొత్తం సంఖ్యలో పదిశాతం ఆ పార్టీకి ఉండాలని నిబంధనలను చెబుతున్నాయన్నారు. వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 11 మాత్రమే కాబట్టి రాలేదన్నారు. వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి లాంటి వారు కేవలం ఎమ్మెల్యే హోదాలో రాణించలేదా అని ప్రశ్నించారు. చాక్లెట్ ఇస్తే బడికి పోతా లేకుంటే పోను అని చిన్నపిల్లలు మారాం చేసినట్లుంది జగన్ వైఖరి అన్నారు.

నేడు బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యుడి రాక

కడప(కలెక్టరేట్), ఆగస్టు 6: ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యుడు జంగం రాజేంద్రప్రసాద్ బుధవారం కడపకు రానున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రానికి సమాచారం అందింది. ఆయన బుధవారం ఉదయం 6 గంటకు కడపకు చేరుకుంటారు. 10 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎస్పీలతో సమావేశం అవుతారు. 11 గంటల నుంచి ఒంటిగంట వరకు అన్ని సంక్షేమ వసతి శాఖల అధికారులు, వార్డెన్లు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు సంక్షేమ వసతి గృహాలను పరిశీలిస్తారు.

లోకేశ్ చొరవతో సౌదీలో మహిళకు రక్షణ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి): ఉపాధి కోసం ఎడారి దేశానికి వచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటున్న అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం తుర్కపల్లె గ్రామానికి చెందిన షేక్ హసీనా అనే 25 ఏళ్ల యువతి తనను రక్షించాలంటూ మంత్రి నారా లోకేశ్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా చేసిన విన్నపం ఫలించింది.



సౌదీలోని భారత ఎంబసీ వద్ద హసీనా

ఈ మేరకు సౌదీ అరేబియాలోని ఏపీ ఎన్నార్టీ ప్రతినిధి, చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరుకు చెందిన చిట్టలూరి రంజిత్ మంగళవారం హసీనాను మరో ప్రతినిధి ముజ్జమ్మిల్‌షేక్ సహాయంతో రియాధ్ నగరంలో సురక్షితంగా భారతీయ ఎంబసీ అధికారులకు అప్పగించారు. గత కొన్ని రోజుల నుంచి సరిగ్గా తిండిలేక నీరసించిపోయిన ఆమెకు భోజన ఏర్పాట్లు చేయించి కొంత నగదు అందించారు. హసీనాను సురక్షితంగా చేర్చిన విషయాన్ని తెలుగుదేశం పార్టీ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు రావి రాధాకృష్ణతో పాటు విజయవాడలోని ఏపీ ఎన్నార్టీ అధికారులకు కూడా వారు తెలియజేశారు. సౌదీ అరేబియా ప్రభుత్వ అధికారుల సహాయంతో ఆమె వీసాను రద్దు చేసి స్వదేశానికి పంపించడానికి ఎంబసీ అధికారులు ప్రయత్నిస్తారని రంజిత్ చెప్పారు.

వందలాది ఎకరాలు అన్యాక్రాంతం

- వెలమవారిపల్లె వద్ద కనుమరుగైన గుట్టలు
- భూ ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపిస్తాం
- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, ఆగస్టు 6: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కె.వెలమవారిపల్లె వద్ద రెండు జాతీయ రహదారుల మధ్యలో ఉన్న రూ.వందలకోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా భూబకాసురులు ఆక్రమించుకున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కె.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో కబ్జాకు గురైన భూములను పరిశీలించి మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఈ ఆక్రమణల విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశానని, వీఆర్ఓ, ఆర్ఐలు కూడా పైఅధికారులకు విషయం తెలిపామని చెప్పారన్నారు. కానీ ఏరోజు కూడా అధికార యంత్రాంగం ఈ కొండల వైపుగాని ఈ భూముల వైపు గాని కన్నెత్తి తచూడకుండా కబ్జాదారులకు అండగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏ విధంగా భూములను కబ్జాచేసి ఆక్రమించుకున్నామో ఇపుడు కూడా అదే విధమైన పంథాను కొనసాగించాలనే ఆలోచనతో కొంతమంది కబ్జాదారులు ఉన్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కొండలు, గుట్టలన్నీ మాయమయ్యాయన్నారు. మిషన్లు, టిప్పర్లు పోలవరంలో కూడా పనిచేయలేదన్నారు.

అసైన్డ్ భూముల పంపిణీనే జరగలేదని, మున్సిపాలిటీ చుట్టూ ఐదుకిలోమీటర్ల వరకు ప్రభుత్వ భూములను ఇవ్వకూడదన్న ప్రభుత్వ నిబంధన ఉందన్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులకు అంతా తెలిసినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని అంటున్నారు తప్ప ఆక్రమనల్ని అడ్డుకోలేన్నారు. ఏ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారో కలెక్టర్ దృష్టికి రెండురోజుల్లోగా తీసుకెళ్లి ఈ ఆక్రమాలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిగ్గు తేలుస్తామన్నారు.

2000 సంవత్సరం నుంచి పులివెందుల నియోజకవర్గంలో వెలమవారిపల్లె, వెంకటటాపురం గ్రామ పొలాల్లో నిరుపేద రైతులకు భూమిని పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఒకవైపు మెడికల్ కళాశాల, మరోవైపు బెంగళూరు, అమరావతి ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న వందల కోట్లరూపాయల విలువైన వందల ఎకరాల భూములను కబ్జాచేశారన్నారు. ఆక్రమిత భూములను మళ్లీ ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చేలా చేస్తామన్నారు. పట్టణానికి ఇంత దూరంలో ఎటువంటి పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోయిన విద్యుత్‌శాఖ అధికారులు ఏ విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి మీటర్లకు అనుమతులు ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వీటన్నిటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా మైసూరారెడ్డి, తాళ్లపల్లె వెంకటేశ్వర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండను పరిశీలిస్తున్న రామగోపాల్‌రెడ్డి

కోడూరుకు చేరుకున్న ఉపేంద్రవర్మ మృతదేహం


మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, బంధువులు, ఉపేంద్రవర్మ (ఫైల్)

రైల్వేకోడూరు, ఆగస్టు 6: విశాఖ పరిధిలోని హుకుంపేట నియోజకవర్గం గడుగుపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరు మండలం ఎస్ఆర్ కండ్రిక గ్రామానికి చెందిన చమర్తి ఉపేంద్రవర్మ మృతి చెందిన విషయం తెలిసిందే. శవపరీక్ష అనంతరం మంగళవారం అతడి సొంత గ్రామానికి మృతదేహం చేరుకుంది. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఉపేంద్రవర్మ మృతితో ఎస్ఆర్ కండ్రిక గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రులు, భార్య, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. రాజకీయ ప్రముఖులు ఉపేంద్రవర్మ బంధువులను పరామర్శించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కాశినాయన ఆగస్టు 6: అమగంపల్లె సమీపంలోని రామచంద్రాపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నరసింహులు (25) అనే యువకుడు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... పోరుమామిళ్ల మండలంలోని చిన్నఎర్రసాలకు చెందిన ఎర్రంశెట్టి తిరిపేలయ్య కుమారుడు ఎర్రంశెట్టి నరసింహులు బ్రహ్మంగారిమఠం వెళ్లి పనిముగించుకొని తిరిగి పోరుమామిళ్లకు వస్తుండగా మైదుకూరు-పోరుమామిళ్ల ప్రధాన రహదారిపై రామచంద్రాపురం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఆ యువకుడిని చికిత్స కోసం మొదట పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కేసు కొట్టివేత

కమలాపురం రూరల్, ఆగస్టు 6 : కమలాపురం రైల్వేస్టేషన్‌లో అన్ని రైళ్లు ఆపాలని స్థానిక రైల్వే గేటు వద్ద చేసిన రైల్‌రోకోతో కమలాపురం ప్రజాప్రతినిధులపై రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసును మంగళవారం విజయవాడలోని వీఐపీ కోర్టు కొట్టివేసింది. కరోనా కారణంగా కమలాపురం రైల్వేస్టేషన్‌లో ఆపేసిన అన్ని రైళ్లకు స్టాపింగ్ ఏర్పాటు చేయాలని, 2022 జనవరి 10న అప్పటి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం రైల్వేగేటు వద్ద రైల్‌రోకో చేశారు. అప్పటి ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లిఖార్జున రెడ్డి, హార్టికల్చర్ స్టేట్ అడ్వయిజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, కమలాపురం మున్సిపల్ చైర్మన్ మేరీలపై కేసు నమోదు చేశారు. దాదాపు రెండున్నరేళ్ల పాటు కేసు విచారణ అనంతరం విజయవాడలోని వీఐపీ కోర్టు ఈ కేసును కొట్టివేసింది.

మద్యం సీసాలు ధ్వంసం


మద్యం సీసాలతో పోలీస్ సిబ్బంది

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 6: నియోజకవర్గ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 688 మద్యం సీసాలను రాయచోటి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో అందజేసి అనంతరం డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ధ్వంసం చేసినట్లు రైల్వేకోడూరు సెబ్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. ఎన్నికల కోడ్ సమయంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని 66 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం విలువ రూ.90 వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కె.ప్రసాద్, డి.రామచంద్ర, వి.రవి తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం...


విగ్రహం ముక్కును పగలకొట్టిన దృశ్యం

కొండాపురం, ఆగస్టు 6: మండలంలోని ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చెన్నకేశవ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. గండికోట ప్రాజెక్టుకు నీళ్లు తగ్గడంతో పాత గ్రామంలోకి వెళ్లి ఈ ఆలయంలో రోజు పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పూజరి గుడిలోకి వెళ్లే సరికి చెన్నకేశవస్వామి విగ్రహం ముక్కును పగలగొట్టినట్లు గుర్తించినట్లు తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయం అతిపురాతనమైనదని, జనమేజయుడనే రాజు కాలంలో నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.గుప్తనిధుల కోసమా లేదా ఉద్దేశ్యపూర్వంగా ఎవరైనా విగ్రహాన్ని పగలగొట్టారా అన్నది తెలియాల్సి ఉంది.

గిరి ప్రదక్షిణకు రహదారి ఏర్పాటు

ఒంటిమిట్ట, ఆగస్టు 6: కోదండరాముని గిరి ప్రదక్షిణ కోసం సీఐ పురుషోత్తమరాజు రహదారిని ఏర్పాటు చేశారు. కోదండరాముని గిరి ప్రదక్షిణకు పెద్దఎత్తున భక్తులు హాజరయ్యేందుకు వీలుగా ప్రచారం నిర్వహించడంతో పాటు భక్తులకు అనుగుణంగా ఉండేందుకు రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించామని ఆయన అన్నారు. కోదండరామాలయం నుంచి పెద్దకొత్తపల్లె, చిన్నకొత్తపల్లె, గంగపేరూరు చెరువు కట్టవెంబడి రాచగుంటపల్లె, రాచపల్లె, సాలాబాదు, మలకాటిపల్లె మీదుగా కోదండరామాలయానికి గిరి ప్రదక్షిణ జరుగుతుందన్నారు. ఈనెల 19వ తేదీ సోమవారం ఉదయం పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ నిర్వహించాలని స్థానికులు, భక్తుల కోరిక మేరకు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైవీయూలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6 : వైవీయూలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని, దీనిపై విద్యాశాఖ మంత్రి తక్షణం స్పందించాలని ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్వీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైవీయూ పరిధిలో కడప నగరంలో రెండు ప్రైవేటు న్యాయ కళాశాలలు ఉన్నాయన్నారు. ఈ కళాశాలల్లో వేల మంది విద్యార్థులు ఏపీతో పాటు తమిళనాడు ఇతర రాష్ట్రాల వారు కూడా అడ్మిషన్లు తీసుకుంటున్నారన్నారు. పేరుకు అడ్మిషన్లు పొందారని కళాశాలల్లో ఎటువంటి తరగతులు నిర్వహించలేదన్నారు. ప్రతిసారి న్యాయవిద్య పరీక్ష ఫలితాల్లో కేవలం 20 మంది ఉత్తీర్ణత కావడం అన్యాయమన్నారు. వేల మంది లక్షల రూపాయలు కట్టి ఎన్నిసార్లు పరీక్షలు రాసినా ఫలితం శూన్యమన్నారు. రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాల్లో న్యాయ కళాశాల ఉన్నందున వైవీయూలో కూడా న్యాయ కళాశాల పెడితే న్యాయమైన విద్య అంది ఫెయిల్ పర్సంటేజీ తగ్గుందన్నారు. ఉన్నత విద్యా మండలి, విద్యాశాఖ మంత్రి దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వీఎస్ నాయకులు భార్గవరెడ్డి, అరవింద్, విష్ణు పాల్గొన్నారు.

ఈవో సర్వీసు వ్యవహారాన్ని మీరు ప్రశ్నించలేరు

ప్రైవేటు వ్యక్తికి స్పష్టం చేసిన హైకోర్టు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో పనిచేసే ఉద్యోగి సర్వీసు వ్యవహారానికి సంబంధించి ఆ శాఖతో సంబంధం లేని ప్రైవేటు వ్యక్తి ప్రశ్నించలేరని హైకోర్టు తేల్చిచెప్పింది. దేవదాయశాఖ పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీ కృష్ణగీత ఆశ్రమం ఈవో శంకర బాలాజీకి కడప జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించడాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌కు విచారణార్హత లేదని స్పష్టం చేసింది. పిటిషనర్ శ్రీ కృష్ణగీత ఆశ్రమంలో ఏ హోదాలోనూ విధులు నిర్వర్తించడం లేదని గుర్తుచేసింది. లీజు హక్కులు, చెల్లింపులు విషయంలో ఏమైనా అభ్యంతరం ఉంటే సంబంధిత వేదికను ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును ఉదహరిస్తూ... పిటిషనర్‌కు ప్రస్తుత పిటిషన్ వేసే అర్హత లేదంది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీ కృష్ణగీత ఆశ్రమం ఈవోగా పనిచేస్తున్న శంకర బాలాజీకి, కడప జిల్లా దేవదాయ సహాయ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ ఆశ్రమం స్థలాన్ని లీజుకు తీసుకొని కళాశాల నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఎం.సురేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం... లీజు బకాయిల విషయంలో దేవాదాయశాఖ, పిటిషనర్ మధ్య సివిల్ వివాదం నడుస్తోందని గుర్తుచేసింది. ఆశ్రమంతో సంబంధం లేని వ్యక్తి, ఈవో సర్వీసు వ్యవహారాన్ని సవాల్ చేయలేరని స్పష్టం చేసింది. అందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు ఉందని పేర్కొంటూ ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

భూమి ఏదైనా.. ఎకరం రూ.30 వేలు..!

- అడ్డగోలుగా భూముల ఆన్‌లైన్
- గత ప్రభుత్వంలో బరి తెగించిన రెవెన్యూ అధికారులు
- కొండలు, చెరువులు గుట్టలు సైతం వదలని వైనం


కొండను చదును చేసి ఏర్పాటు చేసిన కంచె

బి.కోడూరు, ఆగస్టు 6: సాగు చేసుకుంటున్న పొలాలు తమవే అనేందుకు రైతుల వద్ద పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండేవి. అనంతరం వాటిని ఆన్‌లైన్ చేస్తూ వచ్చారు. అయితే గత ప్రభుత్వంలో సాగు చేయకపోయినా భూములు అడ్డగోలుగా ఆన్‌లైన్ చేయించుకుని ఎకరాలకు ఎకరాలు సొంతం చేసుకున్నారు. అవి కొండలైనా, గుట్టలైనా చెరువులు అయినా వదల్లేదు. ఏకంగా కొండలకే కంచెలు వేశారు. చెరువులకు గుట్టలకు కంచెలు వేసి పండ్లచెట్లు నాటుతున్నారు. గత ప్రభుత్వంలో బి.కోడూరు మండలంలో ప్రభుత్వ స్థలమైనా, కొండైనా గుట్టలైనా, చెరువులైనా పిత్రార్జిత భూములు అయినా సరే.. ఎకరంకు రూ.30వేలు ఇస్తే చాలు అడ్డగోలుగా ఆన్‌లైన్ చేశారు. ఇలా ఎకరాలకు ఎకరాలు ఎలాంటి రికార్డులు లేకపోయినా ఆన్‌లైన్‌లో ఎక్కించేశారు. వీటిని అరికట్టేందుకు ఏ అధికారి చొరవ చూపకపోవడం శోచనీయం.

భూముల ధరలు రానురాను అమాంతం పెరగడంతో బద్వేలు-పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాలన్నీ స్థానికేతరుల చేతుల్లోకి వెళ్లాయి. వారు ఒక అడుగు ముందుకు వేసి కొండతూర్పున కొండ సగభాగానికి కంచెలువేశారు. అవన్నీ కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని ఏకంగా చెట్లను నాటేశారు. బద్వేలు నుంచి పోరుమామిళ్ల వెళ్లే ప్రయాణికులు దీనిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఎక్కడాలేని విధంగా బి.కోడూరు మండలంలో రెవెన్యూ వారు అవినీతికి పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొండలు, చెరువులు, గుట్టలు ఆన్‌లైన్

మండలంలో రెవెన్యూ అధికారులు ఒక అడుగు ముందుకు వేసి కొండలు, గుట్టలు, చెరువుతట్లను డబ్బులు తీసుకుని విచ్చలవిడిగా ఆన్‌లైన్‌లో ఎక్కించారు. గతంలో కొండలు, గుట్టలు, చెరువుతట్లు సాగు చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. అవన్నీ గొర్లు, మేకలు, పశువులు మేపుకునేందుకు వాడుకునేవారు. బి.కోడూరు మండలంలో గతంలో దాదాపు 8వేల గొర్లు, నాలుగువేల మేకలు, 12వేల పశువులు ఉండేవి. ఇవన్నీ మేపుకునేందుకు కొండలు, గుట్టలు, చెరువుతట్లు ఉండేవి. ప్రస్తుతం ఈ భూములన్నీ అన్యాక్రాంతం కావడంతో.. మేపుకోను బీడు భూములు లేక గొర్లు, మేకలను రైతులు అమ్మేసుకున్నారు. కనీసం కొండకు వెళ్లి పశువులను, గొర్రెలను మేపుకుందామంటే దారులు కూడా లేవని రైతులు వాపోతున్నారు. కొండచుట్టూ కంచెలు వేసేశారని అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పరిశీలించి కొండలు, చెరువుతట్లు, గుట్టలకు ఉన్న కంచెలు తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. భూములు ఆన్‌లైన్ చేసిన విషయం, కొండలకు కంచె వేసిన విషయమై తహసీల్దారును వివరణ కోరగా, వాటన్నింటినీ పరిశీలించి కంచెలు తొలగిస్తామని అన్నారు.

అడ్డగోలుగా భూముల ఆన్‌లైన్

ఓ రైతుకు పిత్రార్జితం భూమి ఉంది. ఇతను తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్ చేయాలని అడిగితే.. ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని కండీషన్ పెట్టారు. రైతు మా పొలం ప్రభుత్వ భూమి కాదు పిత్రార్జిత భూమి, అనువంశిక భూమి, మా భూమి మాకు ఆన్‌లైన్‌లో ఎక్కించండి అని మొరపెట్టుకున్నా రెవెన్యూ అధికారులు అప్పట్లో లెక్కచేయలేదు. ప్రభుత్వం అయితేనేం అనువంశికమైతేనేమి మాకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాల్సిందేనని చెప్పారు. అప్పట్లో రైతులు ఎంత మొరపెట్టుకున్నా, ఉన్నతాధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో.. చివరకు డబ్బులు ఇచ్చి ఎవరి భూమిని వారు ఆన్‌లైన్ చేయించుకోవాల్సి వచ్చింది.

ఎస్‌పీఏతో వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ ఎంఓయూ


ఎంఓయూ కుదుర్చుకుంటున్న వైస్ చాన్సలర్ విశ్వనాథకుమార్, కొండారమేశ్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6 : భారత ప్రభుత్వ సంస్థ అయిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) మార్గదర్శకంలో కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ డైరెక్టర్ కొండారమేశ్ ఆధ్వర్యంలో ఏఎఫ్ఏయూ వైఎస్ చాన్సలర్ విశ్వనాథకుమార్ ఐదు సంవత్సరాల పాటు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా విశ్వనాథకుమార్ మాట్లాడుతూ అకడమిక్ అంశాలతో పాటు పరిశోధనకు సంబంధించిన కార్యకలాపాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు. కన్సల్టెంట్ కార్యకలాపాలను ప్రోత్సహించడానికి యూజీ, పీజీ కోర్సుల్లో సహకారం అందించేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో భాగస్వామ్య విద్యార్థులకు మెటీరియల్ వెబ్‌నార్లు ఉపన్యాసాలు విద్యార్థుల జ్ఞానమార్పిడి నైపుణ్య సంబంధిత అంశాలపై ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్కిటెక్చర్ డాక్టర్ జనమేజాయిగుప్త, డీన్ పరిశోధన కన్సల్టెంట్ డాక్టర్ అమితవసర్కార్, డీన్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయు కడప ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కుట్రలకు పాల్పడితే ఎవరినీ వదలం : చమర్తి


మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, ఆగస్టు 6 : కుట్రలు కుతంత్రాలకు పాల్పడితే వైసీపీ నేతలను వదలబోమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీల్లో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని టీడీపీ ముద్ర వేసి తొలగించారన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో పనిచేసినవారి పేర్లు ఆన్‌లైన్‌లో ఉండడంతో వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని అడిగేందుకు టీడీపీ నేతలు వెళ్లారన్నారు. బాధితుల పక్షాన ప్రశ్నించినందుకు.. వైసీపీ నేతలు కావాలనే రాద్ధాంతం చేశారన్నారు. బాధితుల పక్షాన మాట్లాడటం తప్పా అని ప్రశ్నించారు. ఉద్యోగం కోల్పోయిన వారిలో ఎస్సీ వర్గానికి చెందిన వారు కూడా ఉన్నారని, నేడు నిరసన చేసిన దళిత సోదరులకు తెలియదా.. ఏరోజు అయినా వారి పక్షాన మాట్లాడారా.. అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు కుట్రపూరిత ఆలోచనలు మాని ప్రజల పక్షాన పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కొమరా వెంకటసుబ్బయ్య, గన్నే సుబ్బ నరసయ్య, సుబ్రమణ్యం నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : బీటెక్ రవి


అన్నక్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, ఆగస్టు 6: అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఉన్న బీటెక్ రవిని కలిసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలను చెప్పుకొన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

అనంతరం పులివెందుల నాలుగురోడ్ల కూడలిలో అన్నక్యాంటీన్ పనులను పరిశీలించారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు రూ.5కే భోజనం అందించడం జరుగుతుందని, పులివెందులకు పలు ప్రాంతాల నుంచి వచ్చే పేద ప్రజలకు అన్నక్యాంటీన్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్త సేకరణ నిధిలో అన్నమయ్య జిల్లా ముందుండాలి

- మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్


రక్తదాతను అభినందిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

కలికిరి, ఆగస్టు 6: దాతల నుంచి సేకరించి భద్రపరిచే రక్త నిధిలో అన్నమయ్య జిల్లా ముందంజలో ఉండాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆకాంక్షించారు. వాతావరణ ఒడిదుడుకుల ప్రభావంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జబ్బులు విస్తరిస్తున్న దృష్ట్యా రక్తం అవసరం ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. రక్తదానం గురించి అపోహలు తొలగించుకోవాలని, యువత రక్తదానం చేయడానికి ప్రతిజ్ఞ చేపట్టాలని సూచించారు. విద్యార్థులంతా ముందుకొచ్చి రక్తదానానికి సహకరిస్తే రక్త కొరత లేని జిల్లాగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభించారు. రక్తదానం కోసం ముందుకొచ్చిన విద్యార్థులను అభినందించారు. తరచూ ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేసి రక్త సేకరణకు పూర్తి సహకారం అందజేస్తామని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర రావు హామీ ఇచ్చారు. విద్యార్థులు టాటూలకు దూరంగా ఉంటేనే రక్తదానానికి అవకాశముంటుందని చెప్పారు. రక్తదాతలు ప్రాణ దాతలుగా అభివర్ణించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 6 : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కొండయ్య వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, గర్భిణులు, బాలింతలకు, విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి గ్రామాల్లో పౌష్టికాహారంపై విస్తృతంగా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు.

ఆరుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఆగస్టు6: అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ ఎన్ శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లె మండలం కొత్తయిండ్లు రంగారెడ్డి కాలనీకి చెందిన పఠాన్ నజియా సుల్తానా (35)ను ఆమె భర్త నూర్ అహమ్మద్‌తో పాటు అతడి కుటుంబసభ్యులు వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితురాలు తాలుకా పోలీసులను ఆశ్రయించింది. తన భర్త ఆటోమొబైల్ షాపులో పనిచేస్తున్నాడని లక్ష రూపాయలు కట్నం తెవాలని హింసకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణ చేసి భర్త నూర్ అహమ్మద్, అత్త జరీనా, ఆడపడుచులు నస్రీంతాజ్, మెరినాతాజ్, రోహిణీ తాజ్, అవ్వ జమృద్దీన్‌బీపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

యువతిని కొట్టి హత్య చేసిన కేసులో ముగ్గురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గత నెల 24వ తేదీ నీరుగట్టువారిపల్లె సమీపంలోని బాబుకాలనీలో సాయిప్రియాంకను అత్తింటివారే హత్య చేశారని సాయిప్రియాంక అమ్మ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన అనంతరం భర్త మణికంఠ, అత్త ఉషారాణి, మామ శ్రీనివాసులను రిమాండ్‌కు తరలించామని తాలుకా సీఐ చెప్పారు.

సవరణ

ఆంధ్రజ్యోతిలో 3-8-2024 కడప ఎర్రముక్కపల్లె చౌడేశ్వరి దేవి ఓరియంటల్ & జనరల్ హైస్కూల్ వారి ఉద్యోగ ప్రకటన దరఖాస్తు చివరితేది 10-9-2024 ప్రచురించినారు. కాని చివరి తేది 14-8-2024 చదువు కొనగలరు.

కరస్పాండెంట్

వ్యవసాయ సమస్యలపై చర్యలు తీసుకోవాలి : బీజేపీ

సింహాద్రిపురం, ఆగస్టు 6: జిల్లాలో వ్యవసాయ సమస్యలపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి హెచ్. సతీష్‌చంద్ర, జిల్లా అధ్యక్షుడు ఐ.రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి జి.అమర్‌నాథ రెడ్డి, సభ్యులు రైతులతో కలిసి డిప్యూటీ కలెక్టర్ అతిది సింగ్‌కు, వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు కడప కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వినతి పత్రంలో కనపరచిన 15 రకాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అందుకు స్పందించిన డిప్యూటీ కలెక్టర్ అతిది సింగ్ ఈ నెల 9న ఆయా సమస్యలకు సంబంధించిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

చేనేత దినోత్సవాన్ని విజయవంతం చేయండి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఆగస్టు 6 : జాతీయ చేనేత దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి జి.నాగరాజరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9గంటలకు స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్ నుంచి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం వరకు జాతీయ చేనేత దినోత్సవ ప్రాధాన్యతపై ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టరు కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ హాలులో జాతీయ చేనేత దినోత్సవంపై సమావేశం ఉంటుందన్నారు. అక్కడ చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'కర్నూలు ఆర్‌ఐఓపై విచారణ జరిపించాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6 : కర్నూలు ఆర్‌ఐఓపై సమగ్ర విచారణ జరిపించాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ రవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో దొంగ బిల్లులు పెట్టి ప్రభుత్వం నుంచి లక్షలాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ నాయకులు హరిబాబు, సురేంద్ర పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

చెన్నూరు, ఆగస్టు 6 : మినుము సాగు చేసిన రైతులు తప్పకుండా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీదేవి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలో ముండ్లపల్లె, రామనపల్లె, శివాలపల్లె, రాచిన్నాయపల్లె, దుగ్గనపల్లె గ్రామాల్లో మినుము సాగు చేసిన రైతులతో మాట్లాడారు.ంరైతులు తమ సమీప రైతు సేవాకేంద్రంలోకి వెళ్లి ఖచ్చితంగా పంటను ముందు చేయించుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి గట్టెక్కాలన్నారు. ఒకవేళ పంట నష్టం జరిగితే నష్టపరిహారం సున్నా వడ్డీ పంట రుణాలు పొందే అవకాశం ఉందన్నారు.

సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించకపోతే ఎలా

- అధికారుల పనితీరుపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అసంతృప్తి
- పెండింగ్ పనులపూర్తికి ముఖ్యమంత్రిని కలుస్తాం
- వేంపల్లె మండల మీట్




వేంపల్లె మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి... హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

వేంపల్లె, ఆగస్టు 6 : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎలా అని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అధికారులపై అసంతృప్తి వెలిబుచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని, గ్రీన్ అంబాసిడర్లు పనులే చేయడం లేదని, గర్భిణులకు విడుదలైన ప్రోత్సాహం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం తగదని పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన, ఎంపీడీఓ దివిజ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను పంపిణీచేయకపోవడం వైద్యసిబ్బంది నిర్లక్ష్యమన్నారు. వీటిని అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. వేంపల్లె మండలంలో మెగా కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన వాటర్ గ్రిడ్ పనులకు గుంతలు తవ్వాక పైన రోడ్డు ఇష్టానుసారంగా వేయడం తగదన్నారు. ఇలాగే కొనసాగిస్తే బిల్లు లు ఇచ్చేది లేదన్నారు. వేంపల్లెలో పెండింగ్‌లో ఉన్న సిమెంటు రోడ్డు, మురుగుకాల్వ నిర్మాణం కోసం సుమారు రూ.20కోట్లు అవుతాయని అంచనా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లి పనులు చేసేందుకు కృషిచేస్తామన్నారు. అంతకుముందు వైద్యం, తాగునీటి సరఫరా, విద్యాశాఖలపై చర్చించారు. వేం పల్లె పాపాఘ్ని నది నుంచి చుట్టుపక్కల ఆగ్రామాలకు తాగునీరు అందిస్తున్నారని, పట్టణంలోని పాత పేట ప్రాంత ప్రజలకు నీరు అందడం లే దని ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్ సభ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలు ఈఓకు సూచించారు. ఈఓ ఆర్డీ మల్లికార్జునరెడ్డి, డీటీ శివలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు మడలస్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురండి

వేంపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ అధికారులకు సూచించారు. ఈఓ సుబ్బారెడ్డి, రైతు బజార్ అధికారిణి రుచితతో మాట్లాడి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరోగ్యమాత ఉత్సవాలను విజయవంతం చేయండి

కడప (కల్చరల్), ఆగస్టు 6: కడప రైల్వేస్టేషన్ సీమపంలో గల ఆరోగ్యమాత ఉత్సవాలు సెప్టెంబర్ 7,8, తేదీలలో జరగనున్నాయని, విజయవంతం చేయాలని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ రెవరెండ్ ఎం.డి. ప్రసాదరావు కోరారు. ఈ మేరకు ఆరోగ్యమాత చర్చిలో తిరుణాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29న జర గనున్న పతాకావిష్కరణకు ముఖ్య అతిథిగా కర్నూలు మేత్రాణులు బిషప్ గోరంట్ల జ్వానేష్ హాజరుకానున్నారన్నారు. జిల్లాలోని విశ్వాసులందరూ హాజరై ఆ తల్లి సేవలో తరించాలని కోరారు. కార్యక్రమంలో మేత్రాసన కోశాధికారి ఫాదర్ ఎస్.సురేంద్ర, కథిడ్రల్ విచారణ గురువులు ఫాదర్ మరియన్న, బిషప్ సెక్రటరీ ఫాదర్ లూర్థు, ఫాదర్ శౌరి, డాన్‌బోస్కో ఫాదర్ జార్జి, ఫాదర్ సుధాకర్, సహాయ డైరెక్టర్ ఫాదర్ పిల్లి మహేష్, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ సెల్వి రాయప్పన్, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

వీసీని కలిసిన పిచ్చయ్యచౌదరి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6 : వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డిని ఉమ్మడి ఏపీ ఇంటర్మీడియట్ విద్యామండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి అలపర్తి పిచ్చయ్యచౌదరి మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన రచన అయిన పర్యాటక పుస్తకాన్ని వీసీకి అందించారు. తన రచనల గురించి వివరించారు. యూనివర్సిటీ అభివృద్ధికి, విద్యార్థులకు ప్రయోజనకరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు.. (ఇన్‌సెట్) విజయదుర్గా అమ్మవారు

కడప (కల్చరల్), ఆగస్టు 6: కడప నగరం బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి మహిళా భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మంగళవారం కావడంతో అమ్మవారికి వేకువజామున పంచామృత అభిషేకం నిర్వహించారు. మధ్యహ్నం 3 గంటల నుంచి 4. 30 వరకు రాహుకేతు పూజలు చేశారు.

'ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి'



నిరసన కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పూర్తిగా రద్దు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద బడుగు, బలహీన విద్యార్థులు కళాశాలలకు సమయానికి రాలే కపోతున్నారన్నారు. బస్సులు సమయానకి రాకపోవడం కొన్నిసార్లు హడావుడిగా భోజనం తీసుకోరాకుండానే కళాశాలలకు వస్తుండడం, దీంతో విద్యార్థులు భోజ నం లేక సతమతమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడాల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లయతే గ్రామీణప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగకరు గా ఉంటుందన్నారు.పీడీఎస్‌యూ నాయకులు మణికంఠనాయక్, హేమంత్, సురేంద్ర, అశోక్, అల్లాబకాస్, శ్రీనివాసులరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రిమ్స్ కాంట్రాక్టర్ నుంచి బాలనాగిరెడ్డిని తప్పించాలి

- 20 ఏళ్లుగా తిష్టవేసి కోట్లకు పడగలెత్తిన వైనం: బీజేవైఎం



రిమ్స్‌లో నీటి సరఫరా వ్యవస్థను పరిశీలిస్తున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్

కడప (మారుతీనగర్), ఆగస్టు 6: రిమ్స్ హాస్పిటల్ కాంట్రాక్టర్‌గా ఇరవై సంవత్సరాలుగా కొనసాగుతున్న బాలనాగిరెడ్డిని తక్షణమే తప్పించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో స్థానిక రిమ్స్ సర్వజన ఆసుపత్రిని సందర్శించారు. పాలకులు మారినా తన దైన శైలిలో లాబీయింగ్ చేసుకుంటూ బాలనాగిరెడ్డి రిమ్స్‌లో పాతుకుపోయారన్నారు. 20 సంవత్సరాలుగా రిమ్స్ కాంట్రాక్టర్‌గా తిష్టవేసి రూ.కోట్లకు పడగలెత్తారన్నారు. అలాగే రిమ్స్ పరిశుభ్రత పట్ల ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. ప్రధానంగా గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో రిమ్స్‌ను సొంత జాగీరుగా చేసుకున్నారని ఆరోపించారు. తక్షణమే ఆయనను తప్పించి కొత్తగా టెండర్లను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జనరల్ సెక్రటరీలు సురేంద్ర, అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌నాయుడు, ట్రెజరర్ శ్రీకాంత్, నాయకులు వినోద్‌రెడ్డి, వెంకట్, షణ్ముక్‌రెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి తోడ్పడండి



సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని సత్కరిస్తున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 6: గత ఐదేళ్లుగా నిరాదరణకు గురైన బీసీ వర్గాలకు తోడ్పాటునందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు బత్తల లింగమూర్తి, ఎం.త్రివిక్రమ్‌యాదవ్ కోరారు. మంగళవారం బీసీ సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన భరత్‌కుమార్‌రెడ్డిని మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వారు కలిసి అభి నందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కార్పొరేషన్లకు నిధులివ్వకుండా చేతులెత్తేయడంతో అన్ని వర్గాల్లో తీవ్ర అంసతృప్తి నెలకొందన్నారు. కావున ఈ ప్రభుత్వంలో అయినా బీసీలకు న్యాయం చేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కళ్యా సుధాకర్, శ్రీనివాసులు, ఖాదర్‌బాష, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సీఆర్‌ఐ సునీల్‌జయంత్, ఆర్ల గంగయ్య, మునిరత్నం గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి నరసింహారావు, ఉపాధ్యక్షులు మల్లికార్జున, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

'హౌస్ బిల్డింగ్ అక్రమాలపై విచారణ చేపట్టాలి'

కడప(కలెక్టరేట్), ఆగస్టు 6: ఏపీ ఎన్జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘ కార్యాలయంలో ఆయన విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ గతంలో కొందరు డైరెక్టర్లు, కొన్ని సంఘాల ప్రతినిధులు హౌస్ బిల్డింగ్ అధ్యక్షుడు కొండారెడ్డి హయాంలో అవినీతికి జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. గతేడాది పూర్తి స్థాయి విచారణ జరిగప్పటికి ఆ నివేదికలను సజ్జల రామకృష్ణారెడ్డి,ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డిల సహకారంతో స్టే తెచ్చుకున్నారన్నారు. కొండారెడ్డి హయాంలో దాదాపు 500 ఇళ్ల స్థలాలు పాత పద్ధతుల్లో కాకుండా సభ్యులు అప్లికేషన్స్ పెట్టుకోమనడం ద్వారా సీనియర్ సభ్యులకు తీరని అన్యాయం చే శారన్నారు. ఇళ్ల స్థలాలు ఇష్టా రాజ్యంగా జూనియర్లకు కేటాయించడం, అపార్ట్మెంట్ నిర్మాణంలో, ప్లాట్ల పంపకాల్లో గోల్‌మాల్ చేసి పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేశారని ఆ రోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న స్టేను ఉప సంహరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న బాబాఫకృద్దీన్

సీకేదిన్నె, ఆగస్టు6: విభిన్న ప్రతిభావంతులకు న్యాయసేవలు ఉచితంగా అందిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫకృద్దీన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లెలోని ఆశా నిలయంలో ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు ఇ.శ్రీదేవి, బాబాఫకృద్దీన్ ఆధ్వర్యంలో సెన్సిటైజేషన్ ప్రోగ్రాం న్యాయవిజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగులు, విభిన్న ప్రతిభావంతులు 18 సంవత్సరాలు వచ్చే వరకు వారికి ఉచిత విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. డిజేబుల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిష్ణకిశోర్, డిస్ట్రిక్ ప్రొబెషన్ ఆఫీసర్ యల్లారెడ్డి, డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఎంఈవో వెంకటరామిరెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పీవో సునీత, ఆశా నిలయం హెడ్మాస్టర్ సిస్టర్ జోలీ, సీకెదిన్నె ఎఎస్ నాగరాజు, ఆశాల నిలయ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్సీఎం ఎయిడెడ్ పోస్టుల్లో అర్హులకు న్యాయం చేయాలి

- ఉప విద్యాధికారికి ఆర్సీఎం ఉపాధ్యాయుల వినతి



ఉపవిద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆర్సీఎం మేనేజ్‌మెంటు ఉపాధ్యాయులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6:ఆర్సీఎం ఎయిడెడ్ పోస్టుల్లో అర్హులకు న్యాయం చేయాలని ఆర్సీఎం మేనేజ్‌మెంటు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఉపవిద్యాధికారి రాజగోపాల్‌రెడ్డికి, ఏడీ మునీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలలో అన్‌ఎయిడెడ్ టీచర్లుగా పనిచేస్తూ అన్ని అర్హతలు కలిగి ఉన్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అర్హత లేని వారు తమకు న్యాయం చేయకుండా అడ్డుకుటున్నారని, దీనిపై అధికారులు విచారణ జరిపించాలని కోరారు. గత కొన్నేళ్లుగా ఉపాధ్యాయులుగా ఆర్సీఎం మేనేజ్‌మెంటులో పనిచేస్తున్నామన్నారు. అన్ని వసతులతో కూడిన పాఠశాల భవంతులు నిర్మించి తమను ఉపాధ్యాయులుగా నియమించి జీత భత్యాలను ప్రతినెలా చెల్లించేవారన్నారు. దీంతో పేద పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నా మన్నారు. అయితే కొన్ని ప్రభుత్వ సర్వీసు రూల్స్ ప్రకారం అర్హత పొందనటువంటి ఉపాధ్యాయులు తమకు అన్యాయం చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఎం మేనేజ్‌మెంటు ఉపాధ్యాయులు ప్రసన్నకుమారి, మరియమ్మ, వేళాంగిణి వసంత, ఎల్.సుమలత, బాలరాజు, జోసెఫ్, సుజాత పాల్గొన్నారు.



సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి



పార్థసారథిరెడ్డికి సమస్యను వివరిస్తున్న హెచ్‌ఎం

వేముల, ఆగస్టు 6: సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి తెలిపారు. మంగళవారం వేములలోని జడ్పీ హైస్కూల్, ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నూతన భవనాలు 90శాతం పూర్తయ్యాయని, బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడన్నారు. దీంతో పూర్తిస్థాయిలో భవనాలు లేక చెట్ల కింద చదువులు చెప్పాల్సి వస్తోందని వివరించారు. పార్థసారథిరెడ్డి స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి, అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ఇందిరారాణిని కలిశారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. ఆయనవెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి

పులివెందుల రూరల్, ఆగస్టు 6: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తొండూరు మండల వైద్యాధికారి డాక్టర్ అరిఫుల్లా సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన తొండూరు పీహెచ్‌సీ నందు ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన ఊపిరితిత్తుల వ్యాధుల గురించి, దోమల ద్వారా వచ్చే ప్రాణాంతక వ్యాధుల గురించి వివరించాలని చెప్పారు. తల్లిపాల వారోత్సవాల ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్వైజర్ శశికళ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేసీకాల్వలోకి మురుగునీరు వదిలితే చర్యలు తప్పవు



మురుగునీరు వదలొద్దని చెబుతున్న కార్యదర్శి

చెన్నూరు, ఆగస్టు 6 : వ్యవసాయ పొలాలకు నీరందించే కేసీ కాల్వలోకి ఎవరైనా తమ ఇళ్లల్లోని మురుగునీటిని వదిలితే చర్యలు తప్పవని చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. చెన్నూరు కొత్తరోడ్డులోని రాజులకాలనీ నుండి కొత్తగాంధీనగర్ హైవే రహదారి వరకు కాల్వకు ఇరువైపులా ఉండే గృహ యజమానులు చాలా కాలంగా మురుగునీటిని వదులుతున్నారని, ఇటీవల పలువురు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మంగళవారం కాల్వకు ఇరువైపులా ఉన్న గృహ యజమానుల వద్దకు వెళ్లి కాల్వలోకి మురుగునీరు వదలొద్దని, ఇళ్ల ముందే గుంతలు కొట్టుకుని అందులోకి వదలాలన్నారు.

కిల్కారి కాల్ ద్వారా ఆరోగ్య సేవలు

లింగాల, ఆగస్టు 6: కిల్కారి కాల్ ద్వారా గర్భిణులు, బాలింతల సంరక్షణ, ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం నుంచి కిల్కారి కాల్స్ రీజనల్ కో ఆర్డినేటర్ కె.కీర్తి సూచించారు. మండల కేంద్రమైన లింగాల పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ కిల్కారి అంటే చిన్నారి చిరునవ్వు అన్నారు. 01244451660 అనే నెంబర్ నుంచి ఫోన్ కాల్ వస్తుందన్నారు. ఆరోగ్య కార్యకర్తలు నమోదు చేసుకున్న ప్రతి గర్భిణి, బాలింతకు కేంద్ర ప్రభుత్వంచే తెలుగు భాషలో వస్తాయన్నారు. గర్భిణి 4వ నెల మొదటి వారం నుంచి ప్రసవించిన తర్వాత బిడ్డ వయసు 10 నెలలు పూర్తయ్యే వరకు ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తుంటాయన్నారు. ప్రతి వారం ఒకటిన్నర నిమిషం పాటు 72వారాలు వస్తాయన్నారు. ప్రసూతి డాక్టర్లు ఈ కాల్స్ ద్వారా గర్భవతి సంరక్షణ, వారికి అందాల్సిన ఆరోగ్య సేవలు, పోషకాహారం, ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తారన్నారు.

రెండో రోజూ కొనసాగిన కేవీకేల స్వర్ణోత్సవ వేడుకలు



మొక్కలు నాటే పరికరాన్ని మహిళా రైతుచే ప్రయోగాత్మకంగా చూపుతున్న అధికారులు

సీకేదిన్నె, ఆగస్టు 6: కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవ వేడుకలను మంగళవారం రెండవ రోజు ఘనంగా నిర్వహించినట్లు కేవీకే సమన్వయకర్త వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాల్లో ఉద్యాన శాస్త్రవేత్త మానస వ్యవసాయం లో సౌరశక్తి ఆవశ్యకత, దాని వినియోగం, ఉపయోగాలపై రైతులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న బియ్యం, కుసుం, సౌరశక్తి అనుబంధ పథకాల గురించి వివరించారు. అనంతరం వీరయ్య ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో మహిళా రైతులకు అనుకూలమైన వ్యవసాయ పనిముట్లు, వాడే పద్ధతులను తెలియజేశారు. కొమ్మలను కత్తిరించే పరికరం, గుళికలను వెదజల్లే పరికరం, మొక్కలు నాటే, నారును విత్తే, పంట కోసే పరికరం గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయిమహేశ్వరి, సురేష్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'సమాన పనికి సమాన వేతనం ఇప్పించండి'

వేంపల్లె, ఆగస్టు 6: ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు సమానపనికి సమాన వేతనం ఇప్పించేందుకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్టు అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పులివెందులలో ఉన్న రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

క్రికెట్ క్రీడాకారులకు న్యాయం చేయండి

జిల్లాలో క్రికెట్ క్రీడాకారులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని వేంపల్లె క్రికెట్ అసోషియేషన్ ప్రతినిధులు గురుప్రసాద్, కేశవలు విజ్ఞప్తి చేశారు. ఇతర జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులను జిల్లాలో ఆడిస్తున్నారని, జిల్లా వాసులకే అవకాశం కలిగేలా చూడాలని కోరారు. ఈ విషయంపై కడప క్రికెట్ అసోషియేషన్ సెక్రటరీ అవ్వారు రెడ్డిప్రసాద్‌తో ఎమ్మెల్సీ ఫోన్‌లో మాట్లాడారు.

అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనరుగా జయవర్ధన్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 6: అఖిలభారత ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ రాయలసీమ జిల్లాల కన్వీనరుగా జాలా జయవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప నగరం ఐఎంఏ హాలులో జరిగిన పార్టీ రాష్ట్ర కన్వెన్షన్‌మీటింగులో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జయవర్ధన్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సుభాష్‌చంద్రబోస్ 1939లో స్థాపించిన ఈ పార్టీకి రాయలసీమ జిల్లాల కన్వీనరుగా తనను ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి, నిర్మాణానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.



సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆది, భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, ఆగస్టు 6: ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డితోపాటు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కలిశారు. జమ్మలమడుగులో వివిధ సమస్యలపై ఎమ్మెల్యే, ఇన్‌చార్జి ఇద్దరు కలిసి ఒక లెటర్ అందించినట్లుగా స్థానిక బీజేపీ కార్యాలయం వారు తెలిపారు. జమ్మలమడుగు అభివృద్ధికోసం వివిధ సమస్యలపై చంద్రబాబును కలిసి చర్చించినట్లుగా తెలిసింది.

జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలి

కొండాపురం, ఆగస్టు 6 : కూటమి ప్రభుత్వం తక్షణమే జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇరగం రమణారెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు కడపలో జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్‌ను కలిసి రైతాంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఖరీఫ్ సీజన్‌లో దెబ్బతిన్న పంటలకు నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, కేంద్ర ప్రభుత్వం అందించే వ్యవసాయ సబ్సిడీ పనిముట్లను అందించాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంఈవో

కాశినాయన ఆగస్టు6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనుప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓ.నిర్మల పేర్కొన్నారు. మంగళవారం ఆమె అంబవరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను (ఉర్దూ,తెలుగు)తనిఖీచేశారు. పాఠశాలలోని పలు రకాల రికార్డులు, నోటుపుస్తకాలను పరిశీలించారు.అనంతరం మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి రుచిచూశారు. ఉపాధ్యాయులకు వంట ఏజెన్సీవారికి పలుసూచనలు సలహాలు అందజేశారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 6: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు బిల్లును వెనక్కు తీసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధా కార్యదర్శి షేక్ సలీం పేర్కొన్నారు. మంగళవారం ఎంపీజే కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించడానికి వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాజేయడానికి పార్లమెంటులో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెడుతోందన్నారు.కార్యక్రమంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు హుస్సేన్‌బాషా, కార్యదర్శి మహమ్మద్‌రఫీ, అస్లాం, పాల్గొన్నారు.

వానలు కురవాలని పూజలు



బోనాలు ఎత్తుకుని కప్పను ఊరేగిస్తున్న గ్రామస్థులు

మైలవరం, ఆగస్టు 6 : వానలు కురవాలి దేవుడా.. పంటలు పండాలి దేవుడా అని కప్పను కుండలో పెట్టుకుని వేపచెట్టు కొమ్మలతో గ్రామంలో ఊరేగింపుగా గ్రామ ప్రజలు పాటలు పాడుకుంటూ వెళ్లి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని బి.జంగాలపల్లిలో గ్రామస్థులు గ్రామ పురవీధుల్లో బోనాలు ఎత్తుకుని గ్రామ చివరి వరకు వెళ్లి చెరువు వద్ద కప్పకు పూజలు చేసి వదిలేశారు. వానలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వానలు కురువాలని పంటలు పండి రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు పూజలు చేశారు.

వేధిస్తున్న డ్రైనేజీ సమస్య

• దెబ్బతిన్న కాలువలు • ఇబ్బందుల్లో ప్రజలు

జమ్మలమడుగు, ఆగస్టు 6: జమ్మలమడుగు మున్సిపాలిటీ డ్రైనేజీ వ్యవస్థ అతిదారుణంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 20 వార్డుల్లో ఏ వీధిలో చూసినా డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందని వాపోతున్నారు. కొన్ని వార్డుల్లో డ్రైనేజీ చిన్న కాలువలు అందులో పగిలిపోయి దెబ్బతిని ఉన్నాయి. మరికొన్ని చోట్ల డ్రైనేజీ కాలువ నిర్మాణమే జరుగలేదు. కేవలం దారి చేసి నీటిని ఉత్తర కాలువలోకి వెళ్లేలా చేశారు. జమ్మలమడుగులో డ్రైనేజీ సమస్యలు పరిష్కారానికి మార్గాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. పట్టణంలోని పలు వీధుల నుంచి డ్రైనేజీ నీరు ఉత్తర కాలువలోకి, దేవగుడి బ్రాంచ్ కెనాల్‌లోకి వెళుతున్నాయి. డ్రైనేజీ కాలువలో నీరు నిలబడి కంపుకొడుతోంది. జమ్మలమడుగులో డ్రైనేజీ వ్యవస్థ నీళ్లు వెళ్లే మార్గమే లేదని డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలతోపాటు నీరు నిలువలు ఉన్నాయి. పాలకులు మారుతున్నా డ్రైనేజీ వ్యవస్థ మాత్రం దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అలాగే పట్టణంలోని పలు చోట్ల గుంతలు పడిన సిమెంటు రోడ్లు, కంకర రోడ్లు దర్శనమిస్తున్నాయి. రోడ్లు సైతం సక్రమంగా లేవు. గత ప్రభుత్వం జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపాలిటీలో గ్రామాల్లో నిర్లక్ష్యం వలనే ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా పూడిపోయిన డ్రైనేజీ కాలువ



ఖాళీ స్థలాల్లో చేరిన డ్రైనేజీ నీరు

ఐటీఐలో మూడో స్పెల్
అడ్మిషన్లకు దరఖాస్తులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 6: ఎర్రగుంట్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో మూడో స్పెల్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆనంద్ పేర్కొన్నారు. పది పాసైన విద్యార్థిని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులు అప్లై చేసుకోవచ్చునని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ఆపరేటింగ్ ప్రోగ్రాం ట్రేడులలో ఒక, రెండు సంవత్సర కోర్సులున్నాయన్నారు. ఎర్రగుంట్ల ఐటీఐలో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసినట్లు, విద్యార్థులు ఎవరైనా ఇక్కడికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పది మార్కుల జాబితా, స్టడీ , టీసీ, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ ఫొటో, విద్యార్థుల ఫోన్‌నెంబర్ తప్పకుండా జతపరచాలన్నారు. ఇతర వివరాలకు 9704111807, 9912946371 సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి

జమ్మలమడుగు, ఆగస్టు 6: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని పీఆర్ హైస్కూలుకు తనిఖీకి వచ్చిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి క్రిష్టప్పకు రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా జమ్మలమడుగు పట్టణంలో ఆయా పాఠశాలల ఎదుట ఐఐటీ, నీట్, ఒలంపియాడ్ పేర్లతో పెద్ద బ్యానర్లు పెట్టుకుని అక్రమ బోధన నడుపుతున్నారన్నారు. విద్యాశాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వివిధ సమస్యలపై వినతి పత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయండి

జమ్మలమడుగు, ఆగస్టు 6: ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గండి సునీల్‌కుమార్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 7, 8 తేదీల్లో కడప నగరంలో జరిగే జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

• వీధుల్లో ట్రాక్టర్లతో ఆందోళన చెందుతున్న ప్రజలు

జమ్మలమడుగు, ఆగస్టు 6: జమ్మలమడుగులో పెన్నానది పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పట్టపగలే చెక్కలలోడుతో ఇసుక అక్రమ రవాణా దందా సాగుతోంది. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా, చిన్న చిన్న సందుల వీధుల్లో ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల జోరు పెరిగింది. ఆ రోడ్లలో చిన్నపిల్లలు బయటకు రోడ్డుపైకి రావాలన్నా ఇసుక ట్రాక్టర్లతో భయపడుతున్నారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. పెన్నానదిలో బంజరు భూముల్లో, ఇటుకల ఫ్యాక్టరీ పెట్టుకుని రాత్రి సమయంలో అక్కడ లోడు చేసి పగలు పట్టణంలో బయటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. అలాంటివారికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం కారణం ఏమై ఉంటుందోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ పాలనలో ఇసుక అక్రమ రవాణా జోరుగా చేశారని కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ వారే అక్రమ రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



వీధుల్లో తిరుగుతున్న ఇసుక ట్రాక్టర్లు

డయేరియాపై అప్రమత్తంగా వ్యవహరించండి

కాశినాయన ఆగస్టు6: డయేరియా కేసులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్యసేవలు అందిస్తూ విషయాలను ఎప్పటికప్పుడు తెలియపరుస్తూ ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు.మంగళవారం నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు.ఈసందర్భంగా ఆసుపత్రికి సంబంధించిన పలురకాల రికార్డులను పరిశీలించి ఓపీ వివరాలు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశా వర్కర్ల సమావేశంలో పాల్గొని వారికి పలుసూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రశాంతిని, ఎస్‌వో రమేష్‌రెడ్డి,ఏఎంవో వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల గుడిసెలను కాల్చివేయడం దుర్మార్గ చర్య



గుడిసెలు కాల్చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు./బద్వేలు రూరల్, ఆగస్టు 6: పట్టణంలోని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలు గూడు లేక అవస్థలు పడుతుంటే వారికి సీపీఐ అండగా నిలిచి భూ పోరాటం ద్వారా గుడిసెలు వేస్తే అధికార, ప్రతిపక్ష నాయకులు ఏకమై అధికారుల ద్వారా పేదల గుడిసెలను కాల్చివేయడం దుర్మార్గ చర్య అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొన్నారు. 1580 సర్వే నెంబరులో గుడిసెలు వేసుకున్న పేదలపై సోమవారం అర్ధరాత్రి సమయంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసు అధికారులు గుడిసెలు తొలగించడం దుర్మార్గచర్య అన్నారు. మంగళవారం కాలి బూడిద అయిన గుడిసెలను బద్వేలు రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. వీఆర్వో సుధాకర్ భూ కబ్జాదారులతో చేయి కలిపి గుడిసెలను తొలగించారని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సుధాకర్, లక్షుమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

నల్లాయపల్లె భూముల కబ్జాపై జేసీకి వినతి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అట్లూరు, ఆగస్టు 6 : అట్లూరు మండలంలోని నల్లాయపల్లె ప్రభుత్వ భూములు వైసీపీ నాయకులు వందల ఎకరాలు ఎక్స్‌కవేటర్లు, డోజర్లు వాహనాలతో చదను చేసి కబ్జా చేసి మామిడి , జామాయిల్‌చెట్లను నాటి కంచెలు వేసి ఆక్రయించుకున్నారని వాటిని సర్వే చేసి పేదలకు దక్కేలా చూడాలని మండల టీడీపీ నాయకుడు పి.మల్లికార్జునరెడ్డి జేసీ అదితిసింగ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. అట్లూరు మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, పేద నిరుపేద కుటుంబాలకు చెందిన భూములు లేనివారికి, ముంపు వాసులకు భూములు పంపిణీ చేయాలని జేసీని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు మన్యం మహేశ్వర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు అల్లం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



పోరుమామిళ్ల, ఆగస్టు 6 : మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో వీధికుక్కలను పట్టి దూర ప్రాంతాలకు తరలించారు. సోమ, మంగళవారాల్లో పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్, మహబూబ్‌నగర్, గిరినగర్ ప్రాంతాల్లో దాదాపు 200కు పైగా కుక్కలను పట్టి దూరప్రాంతాల్లో వదిలినట్లు పంచాయతీరాజ్ విస్తరణాధికారి రాజీవ్‌రెడ్డి తెలిపారు. వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు అధికారుల దృష్టికితేవడంతో కుక్కలు పట్టేవారిని పిలిపించి వాటిని ప్రత్యేక వాహనాల్లో దూర ప్రాంతాల్లో వదిలిపెట్టామని ఆయన తెలిపారు.

గృహ నిర్మాణంపై దిశ నిర్దేశం

బి.కోడూరు, ఆగస్టు 6 : మండలంలో పేదలందరికీ ఇళ్లు నిర్మించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2021 నుంచి 2023 వరకు మంజూరైన ఇళ్ల నిర్మాణం 2024 డిసెంబరులోపు పూర్తి చేసుకోవాలని లేనిపక్షంలో వారికి బిల్లులు రావని దీనిని ప్రతి లబ్ధిదారునికి తెలపాలని వారన్నారు. అలాగే హౌసింగ్‌లకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పనిదినాలు,ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఎన్‌పీసీకి ఇచ్చి లబ్ధిదారులందరికీ పేమెంటుచేయాలని వారు తెలిపారు. ఇక నుంచి ప్రతి బుధవారం ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బందికి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సమావేశం జరుగుతుందని తెలిపారు. వారం వారం ప్రోగ్రాం ఉండాలని, సదరు సిబ్బందికి వారు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్వచ్ఛభారత్ మిషన్ నిధులు కూడా త్వరితిగతిన లబ్ధిదారులకు చెప్పి వారిని మొబలైజేషన్ చేసి పెండింగులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేశ్‌బాబు, జాతీయ ఉపాధి హామీ ఈసీ ఖాజా, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలి

గోపవరం, ఆగస్టు 6 : అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆ ఎంఎస్‌వో నాగరాజు మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజలతో మమేకమై వారి సమస్యలు పరిశీలించి అందుబాటులో ఉండి ఉత్తమ సేవలందించాలన్నారు. ఎంపీడీవో రాధాక్రిష్ణ మాట్లాడుతూ జిల్లాలో పింఛన్ల పంపిణీలో ప్రథమంగా నిలిచామన్నారు. వీధిలైట్లతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిలచాలని కోరారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకులు రామానాయుడు అధికారులకు వినతిపత్రం అందించారు. ఇందులో స్థలాల కబ్జాపై, అలాగే అక్రమ మట్టి రవాణా, అనధికార బోర్లపై అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభారతి, జడ్పీటీసీ జయరామిరెడ్డి, స్థానిక నాయకులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీదేవి వ్రతం



బద్వేలుటౌన్/బద్వేలు రూరల్, ఆగస్టు 6 : స్థానిక సబ్‌జైలు సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మంగళగౌరీవ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చే తొలి మంగళవారం మంగళగౌరీవ్రతం ఆచరించడం సాంప్రదాయమని వేదపండితుడు ప్రదీప్‌కుమార్‌శర్మ తెలిపారు. ఉదయం నుంచి మహిళలు అధికసంఖ్యలోపాల్గొని అమ్మవారికి కలశపూజ నిర్వహించి, అనంతరం మంగళగౌరీవ్రతాన్ని ప్రారంభించారు. ఆలయకమిటీవారు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అనంతరం అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివి

పోరుమామిళ్ల, ఆగస్టు 6 : తల్లి జన్మనిచ్చిన మొదటి గంటలోనే బిడ్డకు ఇచ్చే ముర్రుపాలు సంజీవనితో సమానమని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని టేకూరుపేట కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టేకూరుపేటలో ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలకు విధి నిర్వహణ మీద దిశ నిర్దేశం చేశారు. పీహెచ్‌సీలోని అన్ని రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన తల్లిపాల వారోత్సవాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి రమేశ్‌రెడ్డి, అసిస్టెంటు మలేరియా అధికారి వెంకటరెడ్డి, కరిష్మా, హెల్త్ ఎడ్యుకేటరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజుపాలెం..: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంలా పనిచేస్తాయని సీడీపీవో అరుణకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా టంగుటూరు గ్రామంలోని 4వ సెంటరులో తల్లులతో అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్షుమ్మ, రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు మణిదేవి, నాగమ్మ, రాజేశ్వరి, లక్ష్మి ఆయాలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: తల్లిపాలతోనే చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సూచించారు. మంగళవారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని దుత్తలూరు నగర్‌లో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ముంతాజ్‌బేగం, ఆరోగ్య సిబ్బంది సునీత, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం..: తల్లి పాలు అమృతంతో సమానమని వైద్యాధికారి ఎన్.హిమబిందు అన్నారు. మంగళవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కేఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సిర్డ్ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, డీపీఎఫ్‌వో శివశంకరయ్య, సూపర్‌వైజర్ రాజారత్నం, సిద్దారెడ్డి, హెల్త్ సెక్రెటరీలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.





పోరుమామిళ్ల.. టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు, రాజుపాలెం...టంగుటూరులో ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో అరుణకుమారి